క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు



పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని 25వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వట్టిప్రోలు రంగారావు ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.
■ అబ్దుల్ కలాంమార్గ్‌లో హైకోర్టు న్యాయవాదులు బండారు రాధిక నూతన అడ్వకేట్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు సోమవారంతో ఆఖరు తేదీ అని ప్రాజెక్టు సీడీపీఓ వి.సుజాతదేవి ఆదివారం తెలిపారు. ప్రాజెక్టులోని నడింపాలెం ఎస్సీ కాలనీ, గనికపూడి డీడబ్ల్యూ, పెదనందిపాడు బీసీ-1, ముట్లూరు వడ్డెరపాలెం సెంటర్లలో ఖాళీ పోస్టుల భర్తీకి ఇటీవల ఆ శాఖ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో సోమవారం సాయంత్రంతో దరఖాస్తుకు గడువు ముగియనుందని, ఆసక్తి ఉన్న అర్హులు దరఖాస్తు ఐదు గంటల్లోగా అందించాలని సీడీపీఓ ఒక ప్రకటనలో కోరారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



పొన్నూరు: పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో కృష్ణ దేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్టీ, కాపు సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, తులసి సంస్థల అధినేత తులసి రామచంద్ర ప్రభు పాల్గొని పేద విద్యార్థులు 120 మందికి రూ. 4లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన ట్రాక్టర్

యువకుడికి తీవ్ర గాయాలు



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ దేవస్థానం వద్ద ఆదివారం జరిగింది. చుండూరు మండలం తొట్టెంపూడి గ్రామానికి చెందిన మధిర రవీంద్ర ద్విచక్ర వాహనంపై తెనాలి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గంమధ్యలో చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీ కొట్టింది. సంగం జాగర్లమూడి లాకుల వద్ద వినాయక నిమజ్జనం చేసి వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా ప్రధాన రహదారి మీదకు వచ్చి ఎదురుగా ఉన్న బైక్‌ను ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో రవీంద్ర తలకు బలమైన గాయమైంది. కాలు విరిగి, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు తొలగించాలి




గుంటూరు రూరల్: అనుమతి లేకుండా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని వెంటనే తొలగించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. గుంటూరు- పొన్నూరు జాతీయ రహదారిలో బుడంపాడు శివారుల్లో ఒక ప్రైవేట్ కళాశాల వద్ద రోడ్డుపై అక్రమంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడమే కాకుండా వీటి ముందు కనీసం జీబ్రా గీతలు కూడా లేకపోవడం , వాటిని వాహనదారులు గుర్తించడానికి వీలుగా ముందుగా సైన్ బోర్డుల ఏర్పాటు వంటివి లేక వాహనదారులకు ఇబ్బంది ఎదురవుతోంది. దగ్గరకు వచ్చే వరకు ఇవి కనిపించక, ఒక్కసారిగా వాహనాలకు బ్రేకులు వేస్తుండటంతో వెనుకగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. గత వారం రోజుల్లో ఈ స్పీడు బ్రేకర్ల వద్ద రోజుకు రెండు ప్రమాదాల చొప్పున జరిగాయని, అయితే ఎటువంటి ప్రాణ నష్టం లేకపోయినా వాహనాలు ధ్వంసమైన ఘటనలు ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన ఈ స్పీడ్ బ్రేకర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని పలువురు కోరుతున్నారు.



వెనిగండ్ల గ్రామోత్సవంలో వినాయకుడు



నంబూరులో నిమజ్జనానికి వెళుతున్న గణనాథులు



ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

వైభవంగా గణేష్ నవరాత్రి వేడుకలు



కోయవారిపాలెంలో పూజలందుకుంటున్న గణపతి



నిమజ్జన వేడుకల్లో కర్రసాము చేస్తున్న చిన్నారులు



కోయవారిపాలెంలో జరుగుతున్న అన్నదానం

ప్రత్తిపాడు: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో జై బోలో గణేష్ మహరాజ్ నామస్మరణ మార్మోగుతుంది. ఇప్పటికే ఐదు రోజులు ముగిసిన విగ్రహాలు నిమజ్జనానికి తరలుతుండగా, మండపాల్లో కొలువుదీరిన గణనాథులు పూజలందుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడుతో పాటు తుమ్మలపాలెం, కోయవారిపాలెం, గొట్టిపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు ఆదివారం ఆయా విగ్రహ కమిటీలు ప్రత్యేక పూజలు నిర్వహించాయి.

కోయవారిపాలెంలో అన్నదానం..

మండల పరిధిలోని కోయవారిపాలెంలో గణేష్ నవరాత్రి మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. గణేష్ ఉత్సవ కమిటీ, తెలుగు యువత ఆధ్వర్యంలో గ్రామంలో గత ఇరవై నాలుగు సంవత్సరాలుగా నిర్విరామంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది రజతోత్సవ మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తుల సహకారంతో ఆదివారం భారీ అన్నదానం చేపట్టారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జన వేడుకలు

పెదకాకాని: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పందిళ్ళలో ఏర్పాటు చేసిన గణనాథులను నిత్యం భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. చవితి నవరాత్రులలో భాగంగా నిర్వాహకులు ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించి ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. పూజలు చేసిన గణనాథులకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. దారి పొడవునా భక్తులు పూజా ద్రవ్యములు సమర్పించి భక్తిని చాటుకుంటున్నారు. మండలంలోని నంబూరు, పెదకాకాని, వెనిగండ్ల గ్రామాలలో శని, ఆదివారాలలో కనకతప్పెట్లు, మేళతాళాలు, భేతాళ నృత్యాల నడుమ ఘనంగా గ్రామోత్సవం, లడ్డు వేలం పాటలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని గుంటూరు చానల్(కొత్తకాలువ)లో నిమజ్జనం చేశారు. కాలువ వద్ద రాత్రి వేళల్లో నిమజ్జనానికి ఆటంకం కలుగకుండా పెదకాకాని పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

చేబ్రోలు మండలంలో నిమజ్జనాలు..

చేబ్రోలు: బై... బై...బొజ్జ గణపయ్యా.. జై బోలో గణపతి మహరాజ్‌కీ అంటూ వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై వినాయక విగ్రహాలను గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగింపు చేసిన అనంతరం నిమజ్జనానికి తరలించారు. చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలు నిమజ్జనా కేంద్రాలకు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చాయి. చేబ్రోలులోని కొమ్మమూరు చానల్ నిమజ్జనా కేంద్రానికి, వడ్లమూడి గరువుపాలెం సంగం జాగర్లమూడి లాకుల వద్ద నిమజ్జన కేంద్రానికి భారీ, చిన్న వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వందల సంఖ్యలో తరలివచ్చాయి. కొమ్మమూరు చానల్ వద్ద నిమజ్జనా కేంద్రానికి గుంటూరు, పొన్నూరు, చేబ్రోలు, మంచాల పరిసర గ్రామాల నుంచి భక్తులు లారీలు, ట్రాక్టర్లు, కార్లు, ఆటోల్లో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయి. అనంతరం యువకులు, మహిళలు స్థానికంగా ముట్లూరు చానల్ వద్ద స్నానాలు చేయటానికి ఆసక్తి చూపారు. చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ నిమజ్జన కేంద్రంను పర్యవేక్షించారు. కొమ్మమూరు చానల్ వద్ద పోలీసులు, ఇరిగేషన్, పంచాయతీ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. నిమజ్జన కేంద్రాల వద్ద చేబ్రోలు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



నంబూరులో నిమజ్జనానికి గణనాథుడు



మంచాల గ్రామంలో వినాయక విగ్రహం



చేబ్రోలు కొమ్మమూరు చానల్ వద్ద విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

శరవేగంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



కోయవారిపాంలెంలో వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న సిబ్బంది



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రత్తిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే శరవేగంగా జరుగుతుంది. ఆదివారం సెలవు అయినప్పటికీ వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఇంటి బాట పట్టారు. గ్రామాల్లో నేరుగా సామాన్య ప్రజలు, గర్భిణులు, బాలింతలతో పాటు మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి పరీక్షలు చేశారు. గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియా గ్రేస్ సర్వే ప్రక్రియను పరిశీలించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజా రక్ష ..

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య రక్షణ కార్యక్రమం అని నల్లపాడు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ కృష్ణప్రభ తెలిపారు. ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నల్లపాడు గ్రామంలోని రెండు వార్డు సచివాలయాలు, అంకిరెడ్డిపాలెం వార్డు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈ సర్వేలో భాగంగా సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యులు ప్రతి ఇంటికి వెళ్ళి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి పలు రకాల పరీక్షలు నిర్వహించటం జరిగిందన్నారు. అదే విధంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి తగిన సూచనలు, మందులు పంపిణీ చేశారన్నారు. ప్రతి ఇంటికీ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లి వారి ఆరోగ్యంపై సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంతో రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని సకాలంలో వైద్య సేవలు పొందేందుకు మంచి అవకాశమని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లడిగుంటలో మెరుగ్గా పారిశుద్ధ్యం

పుల్లడిగుంట సర్పంచ్ షేక్ పర్వీన్ సుల్తానా

ప్రత్తిపాడు: గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉందని పుల్లడిగుంట సర్పంచ్ షేక్ పర్వీన్ సుల్తానా అన్నారు. వట్టిచెరుకూరు మండల పరిధిలోని పుల్లడిగుంట గ్రామంలో పారిశుద్ధ్యం క్షీణించి, ప్రజలు రోగాల బారిన పడుతున్నారంటూ ఓ పత్రికలో కథనాన్ని ప్రచురించారు. దీనిపై గ్రామ వైఎస్సార్ సీపీ సర్పంచ్ షేక్ పర్వీన్ సుల్తానా తీవ్రంగా స్పందించారు. గ్రామ పంచాయతీలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మురుగు కాలువల్లో పూడిక తీయించడంతో పాటు వానాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తాగునీరు క్లోరినేషన్ చేయించడం, అపరిశుభ్ర పరిసరాలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లించడం వంటివి చేశామన్నారు. అయినా కూడా ఓ పత్రిక పనిగట్టుకుని తమ పంచాయతీలో ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారంటూ అసత్య కథనాలను ప్రచురించిందన్నారు. గ్రామంలో ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో ప్రత్యేకంగా ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు చేయించామని, ఎవ్వరికీ జ్వరాలు లేవని సర్పంచ్ తెలిపారు.



పుల్లడిగుంటలో ప్రజలకు వైద్య పరీక్షలు చేయిస్తున్న సర్పంచ్ షేక్ పర్వీన్ సుల్తానా

రెల్లి కులస్తుల సంక్షేమానికి కృషి

నెహ్రూనగర్: రెల్లి కులస్తుల సంక్షేమానికి తగిన కృషి చేస్తానని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శిరంసెట్టి పూర్ణ చంద్రరావు పేర్కొన్నారు. కొండా వెంకటప్పయ్య కాలనీలో ఆదివారం సంఘ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెల్లి కులస్తులు ఆర్థిక, సామాజిక అసమానతలకు గురై ఎన్నో కష్టాల్ని అనుభవిస్తున్నారని తెలిపారు. రెల్లి కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేసి ప్రభుత్వం దృష్టికి వారి సమస్యలు తీసుకువెళతానని చెప్పారు. మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ యలమంచిలి సామ్రాజ్యం, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ చెన్నా వెంకట్రావు, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

హిందూ అపర కర్మల సత్రం ప్రారంభం



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో హిందూ అపర కర్మల సత్రం భవన ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన బాపతు శ్రీనివాసరెడ్డి, నరాల లక్ష్మీరెడ్డి, మామిళ్లపల్లి వీరాంజనేయులు ఆధ్వర్యంలో పదిహేను మంది దాతల నుంచి సేకరించిన రూ. ఏడు లక్షల రూపాయల విరాళాలతో స్థానిక చిన్నచెరువు కట్టపై నూతన హిందూ అపర కర్మల భవనం నిర్మించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ పెద్దల చేతుల మీదుగా సత్రాన్ని ప్రారంభించారు. సత్రం నిర్మాణానికి సహకరించిన దాతలు, గ్రామస్తులను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. దాతల చేయూతతోనే దశాబ్దాలుగా ప్రత్తిపాడు గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని చెప్పారు.

మనస్తాపంలో భర్త ఆత్మహత్య



పాతమల్లాయపాలెం(ప్రత్తిపాడు): భార్య లేదన్న మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కుర్రి వెంకటరెడ్డి(70) భార్య విజయలక్ష్మి మూడు నెలల కిందట మృతి చెందింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటరెడ్డి గత కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతున్నాడు. గతంతో ఓ సారి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ నెల 21వ తేదీ మరోమారు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ప్రత్తిపాడులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం వెంకటరెడ్డి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు కుర్రి మధుసూదన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపారు.

దొంగ దీక్షలతో ప్రజలను మోసగిస్తున్న టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

- స్కిల్ స్కాంలో చంద్రబాబును పక్కా ఆధారాలతో అరెస్టు చేసిన సీఐడీ
- అసెంబ్లీలో చంద్రబాబు అరెస్టుపై చర్చకు రాకుండా పారిపోయిన టీడీపీ ఎమ్మెల్యేలు
- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు : ప్రపంచంలో చంద్రబాబును మించిన మోసగాడు లేడని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. స్కిల్ స్కాంలో పక్కా ఆధారాలతో సీఐడీ చంద్రబాబును అరెస్టు చేస్తే ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేశారంటూ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నాయకులు దొంగ దీక్షలు చేస్తూ ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. ఆదివారం పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమాల కేసులో చంద్రబాబు జైలు నుంచి ఇక రాడని తెలిసే బాలకృష్ణ నేనున్నానని తమ నాయకులకు చెబుతున్నాడని అన్నారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు 13 సంతకాలు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రెండు సంతకాలు చేసి అడ్డంగా దొరికారని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు ఇప్పటివరకు పలు కేసుల్లో స్టేలు తెచ్చుకున్నాడన్నారు. అసెంబ్లీలో స్కిల్ స్కాం గురించి పూర్తి ఆధారాలతో చర్చిస్తామంటే టీడీపీ ఎమ్మెల్యేలు పారిపోయారన్నారు. పలు కంపెనీలను సృష్టించి రూ. 371 కోట్లను లోకేశ్, చంద్రబాబు కలిసి కిలారు రాజేష్ ద్వారా దారి మళ్లించారన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ప్రజాధనాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేసి అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. చంద్రబాబు కేసును న్యాయపరంగా ఎదుర్కొనే దమ్ములేక క్వాష్ పిటిషన్ ద్వారా కేసు లేకుండా చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఢిల్లీ న్యాయవాదులకు కోట్లాది రూపాయలు ముట్టజెబుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ పెద్దల చుట్టూ లోకేశ్ తిరుగుతూ కేసుల నుంచి తప్పించుకునేందుకు మార్గాలు వెతుకుతున్నారని అన్నారు. పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర 25 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని నాలుగేళ్లలో చేసి చూపించానని తెలిపారు. 25 సంవత్సరాల్లో రైతుల ఆస్తి అయిన సంగం డెయిరీని కంపెనీ కింద మార్చేసి డీవీసీ హాస్పిటల్‌కు కోట్లాది రూపాయలు మళ్లించారని ఆరోపించారు. ఈ సమావేశంలో పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ దాసరి నారాయణరావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.
కాగా పొన్నూరు పట్టణం 23వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పుట్లా సంపత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సంపత్‌ను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ రూ.1.70 లక్షలు

గుంటూరు రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నల్లపాడు గ్రామంలోని శ్రీ అంకమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో 30వ గణేష్ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా స్వామి వద్ద పూజలు అందుకున్న లడ్డూ వేలంపాటను నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు కొటు గోపిరెడ్డి లడ్డూను వేలంలో రూ.1.70 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి లడ్డూను ఊరేగింపుగా తీసుకువెళ్ళారు. కార్యక్రమంలో అంకమ్మతల్లి యూత్, గ్రామంలోని భక్తులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారు (ఇన్‌సెట్) వేలంలో లడ్డూను దక్కించుకున్న గోపిరెడ్డి

చలపతి కళాశాలలో ముగిసిన శిక్షణ శిబిరం

గుంటూరు రూరల్: విద్యార్థులు విద్యతోపాటు సాంకేతిక నైపుణ్యతలు ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ తెలిపారు. గత ఐదు రోజులుగా నగర శివారులోని లాం కళాశాలలో జరుగుతున్న మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై శిక్షణ సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్, మోడల్ బిల్డింగ్, డేటా అనాలసిస్, డేటా సెట్, యూపింగ్ తదితర అంశాలను వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సుజిత్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను మెరుగు పరచవచ్చన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత సమాచారాన్ని ఇంటర్‌నెట్ సహాయంతో ఏవిధంగా భద్రపరుచుకోవాలో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భార్గవ్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలి

రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ముప్పాళ్ల సుబ్బారావు

ప్రత్తిపాడు: విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలని రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా రోటరీ ఆర్-3150 జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ముప్పాళ్ల సుబ్బారావు, రోటరీ జిల్లా చైర్ పాటిబండ్ల శివరంజని హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగం, ఉపాధితో పాటు సమాజ హితంలోనూ పాలుపంచుకోవాలన్నారు. ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌తో కలిసి భవిష్యత్తులో సమాజసేవా కార్యక్రమాలు చేపట్టనున్నామని వివరించారు. మలినేని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ హెడ్ డా.సుబ్బారావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా చేసే కార్యక్రమాలకు జేఎన్‌టీయూ ఆర్థిక ఆసరాతో పాటు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జెట్టి అప్పారావు ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించారు.



ముఖ్య అతిథులను సత్కరిస్తున్న కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్

వృద్ధురాలి నుంచి ఆభరణాలు లాక్కుని పరారీ

పట్నంబజారు: వృద్ధురాలి మెడ నుంచి బంగారు ఆభరణాలు దోచుకుపోయిన సంఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణనగర్‌లో 70 సంవత్సరాల వృద్ధురాలు వరలక్ష్మి ఒక్కరే ఇంట్లో ఉంటారు. ఈ నెల 24న తెల్లవారుజామున మోటార్ వేసేందుకు ఇంట్లోంచి బయటకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ఆమె నోరు మూసేసి మెడలో బంగారు గొలుసు, నాలుగు గాజులు లాక్కుని పరారయ్యారు. కొద్దిసేపటి తరువాత ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు ఆభరణాలు కూడా చోరీకి గురైనట్లు గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరులు రూ 2లక్షల విలువ చేసే బంగారం ఎత్తుకు పోయినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.